ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

శనివారం 4 మే 2024

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి

బంగారపేట, మే 3: పట్టణంలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. శుక్రవారం దేశిహళ్ళిలోని రవికిరణ్ అనే రైతుకు చెందిన రెండు ఆవులను పొలం గట్టున కట్టేశారు. సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షంలో పిడుగు పడడంతో ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ పాడిఆవులపైనే జీవనం సాగిస్తామని, ఆవుల మృతితో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విజయాలు కావు.. విద్వేషాలు

- ప్రధాని మోదీవి రెచ్చగొట్టే ప్రసంగాలే
- పదేళ్లలో ఆయన చేసిందేమీ లేదు : సీఎం సిద్దరామయ్య



ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య



ప్రజాధ్వని సభావేదికపై సీఎం, డీసీఎం తదితరులు

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో మతతత్వ, ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని పదేళ్లలో తాను సాధించిన విజయాల గురించి నోరు విప్పరని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. శుక్రవారం ఉత్తరకన్నడ జిల్లా ముండగోడలో ప్రజాధ్వని 2.0 ప్రచారసభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రధాని ప్రజలను ఆకర్షించేలా మాట్లాడతారని, అయితే ప్రజల మనోభావాలు, మతం, ద్వేషం పేరిట రాజకీయాలు చేస్తారన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో విదేశాలనుంచి నల్లధనం తీసుకొస్తానన్న హామీకి పదేళ్లు పూర్తయ్యిందన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు అని చెప్పారని ఆ లెక్కన 20 కోట్లమందికి ఉద్యోగాలు రావాల్సి ఉందన్నారు. కానీ 20లక్షల మందికి కూడా ఉద్యోగాలు రాలేదన్నారు. ఉద్యోగాలు అడిగితే పకోడీలు అమ్మాలనే వీరి విధానం సమంజసమా అన్నారు. మోదీ మోదీ అనే యువతకు మూడు నామాలే అంటూ ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయం పెరగలేదని, పంట ఉత్పత్తుల ధరలు తగ్గి నష్టం మిగిలిందన్నారు. పదేళ్లలో నిత్యావసర ధరలు అమాంతం పెరుగుతూనే ఉన్నాయన్నారు. పేదలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తారని, ప్రధాని మోదీ రాష్ట్రానికి బియ్యం కోటాలు ఇవ్వలేదన్నారు. ఇటువంటివారికి ఓటు వేస్తారా..? ఆలోచించుకోవాలన్నారు.

● డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు అధికారం లభించినట్లే అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అటవీ భూములు అనుభవించేవారికి పట్టాలు ఇస్తామన్నారు. రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని, డ్యామ్‌లు కట్టిందా, జాతీయ బ్యాంకులు తెచ్చిందా..? పవర్‌హౌస్‌లు ఏర్పాటు చేసిందా..? ఇవి అన్నీ కేవలం కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. కార్యక్రమంలో ఉత్తరకన్నడ అభ్యర్థి అంజలి నింబాల్కర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మంకాల్‌వైద్య, రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ, ఎమ్మెల్యేలు దేశ్‌పాండే, భీమణ్ణనాయక, శ్రీనివాస్ మానె, శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

వారసత్వానికా.. దేశ రక్షణకా..?

- ఆలోచించి ఓటెయ్యండి..
- కాంగ్రెస్‌వి నీచ రాజకీయాలు
- హుక్కేరి సభలో అమిత్‌షా

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్ర అభివృద్ధిని ఆకాంక్షించి దేశ రక్షణ లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తారా..? వారసత్వ రాజకీయాల పరంపర కొనసాగించే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తారా..? అనేది నిర్ణయించాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. బెళగావి జిల్లా హుక్కేరిలో శుక్రవారం బహిరంగసభలో ఆయన మాట్లాడారు. బెళగావి, చిక్కోడి అభ్యర్థుల తరపున అమిత్‌షా ప్రచారం చేశారు. వేలాదిమంది ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ మోదీ కి మద్దతు ఇచ్చినందుకు భవ్య రామమందిరం సాధ్యం కాలేదా అంటూ ప్రజలను ప్రశ్నించారు. రామమందిరం విషయంలో ఎన్నో ఏళ్లకాలం వివాదం కొనసాగిందని కేసు పరిష్కారం కాగానే ప్రధాని మోదీ భూమి పూజ చేసి రామ్ లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారన్నారు. రాహుల్, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆహ్వానం పంపినా ఓటుబ్యాంకు రాజకీయం కోసం గైర్హాజరయ్యారన్నారు. కాశీ విశ్వనాథ మందిరాన్ని ఔరంగజేబు నాశనం చేశారని, కాశీ కారిడార్‌తో రూపు రేఖలు మార్చారన్నారు. సోమనాథ్ మందిరంలో మార్పులు అందరికీ తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. కశ్మీర్ మనది కాదా..? అంటూ ప్రజలను ప్రశ్నించారు. కశ్మీర్‌తో ఏం సంబంధమని ఖర్గే వ్యాఖ్యానిస్తారని, దేశప్రజలు కశ్మీర్ కోసం ప్రాణత్యాగానికి సిద్ధమన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తే అల్లకల్లోలమని వ్యాఖ్యానించారని, ఇటీవల అక్కడ హింసకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దేశవ్యాప్తంగా నిషేధించబడిన పీఎఫ్ఐకు కాంగ్రెస్ అండగా ఉందన్నారు. బెంగళూరులో బాంబు పేలుళ్లు, విద్యార్థిని నేహా హిరేమఠ కేసును సీబీఐకు ఇస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని డిమాండ్ చేశారు. హిందూ వ్యతిరేకులు, హిందువులను అవమానం చేసేవారు, సనాతన ధర్మాన్ని రక్షించేవారి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అన్నాసాహెబ్ జొల్లెకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శశికళ జొల్లె, దుర్యోధన ఐహొళె, డాక్టర్ రాజేశ్ నెర్లగి, ఈరణ్ణ కడాడి, రమేశ్‌కత్తి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



బీజేపీ నేతల అభివాదం

ప్రజ్వల్ రాసలీలలే ప్రధానాస్త్రం



- రెండో విడత ప్రచారంలో దాడి పెంచిన కాంగ్రెస్
- నాలుగు రోజుల్లో పోలింగ్.. కూటమి నేతల్లో పెరిగిన ఆందోళన
- ప్రజ్వల్ వేధింపులపై మరో మహిళ ఫిర్యాదు
- ఎక్కడ ఉన్నా వదిలేది లేదు : సీఎం

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): రెండో విడత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు పెంచింది. ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ అంశాన్నే ప్రధానాస్త్రంగా సంధిస్తోంది. ఐదారు రోజులుగా ప్రతి సభలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కూటమి నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రెండో విడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ముందే రాసలీలల వ్యవహారం తారస్థాయికి చేరడంతో మరో నాలుగు రోజుల్లో జరిగే పోలింగ్‌పై ఎటువంటి ప్రభావం చూపుతుందో అనే ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రజ్వల్ రేవణ్ణ వివాదం జాతీయ స్థాయిలో ప్రతి నాయకుడు నిత్యం వ్యాఖ్యానించే పరిసితి కొనసాగుతోంది. అంతర్జాతీయ మీడియాలోనూ ఇదే చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ప్రత్యేకించి ఉత్తర కర్ణాటక జిల్లాల్లోని 14 లోక్‌సభ నియోజకవర్గాల పోలింగ్‌పై ఎటువంటి పరిణామం ఉంటుందనేది ప్రస్తుతం రాష్ట్రమంతటా ఉత్కంఠ అవుతోంది. రాష్ట్రంలో 14 లోక్‌సభ నియోజకవర్గాల్లో తొలి విడత పోలింగ్ ఏప్రిల్ 26న జరిగింది. అంతకు మూడు నాలుగురోజులకు ముందే రాసలీలల పెన్‌డ్రైవ్‌లు హాసన్‌లో హల్‌చల్ చేసినా మిగతా ప్రాంతాలకు సమగ్ర సమాచారం లేదు. పోలింగ్ జరిగిన అర్ధరాత్రి తర్వాత ప్రజ్వల్ జర్మనీకి పరారీ కావడంతో విషయం సునామీలా పెల్లుబికింది. ఉత్తర కర్ణాటక ప్రాంతం బీజేపీకి అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం ఎన్నిక జరిగే 14 స్థానాల్లోనూ సిట్టింగ్ ఎంపీలు బీజేపీకి చెందినవారే ఉన్నారు.

● రెండో విడతలో చిక్కోడి, బెళగావి, బాగల్కోట్, బీజాపూర్, గుల్బర్గా, రాయచూరు. బీదర్, కొప్పళ, బళ్ళారి, హావేరి, ధారవాడ, ఉత్తరకన్నడ, దావణగెరె, శివమొగ్గ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో లింగాయత సామాజిక వర్గానికి చెందినవారు అత్యధికులు. కాంగ్రెస్ పార్టీ ప్రజ్వల్ వివాదాన్ని ప్రధాన అంశంగా ప్రచారం చేస్తోంది. ఇంతకుముందు హుబ్బళ్ళిలో నేహా హిరేమఠ విద్యార్థిని కళాశాల క్యాంపస్‌లో జరిగిన హత్య లవ్ జిహాద్‌గా బీజేపీ ప్రచారం చేసింది. నేహా వివాదం కొనసాగుతున్న తరుణంలోనే ఆమె కుటుంబీకులను బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పరామర్శిస్తూ వస్తున్నారు. ఈలోగానే ప్రజ్వల్ అంశం బహిరంగం కావడం జాతీయస్థాయిలో కుదిపేస్తుండడంతో కాంగ్రెస్ ఇదే అస్త్రంగా ప్రచారం చేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మైసూరులో అభ్యర్థుల తరపున ప్రచార సభలో హాసన్ అభ్యర్థి ప్రజ్వల్ కూడా ఉన్నారు. వందలాదిమందిని లైంగిక దౌర్జన్యాలకు పాల్పడిన ప్రజ్వల్ తరపున ప్రచారం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశలోని మహిళలకు క్షమాపణ చెప్పాలని, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ శివమొగ్గలో డిమాండ్ చేశారు. ప్రతి సభలోనూ ఇదే అంశాన్ని కాంగ్రెస్ ప్రస్తావిస్తోంది. కాంగ్రెస్ నేతలు ఇటీవల కొన్ని రోజులుగా 15 కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తామని అభిప్రాయపడ్డారు. అయితే తాజాగా 20 స్థానాలు అధిగమిస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం బీజేపీ దెబ్బకొట్టనుందా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అందుకే సాధ్యమైనంత మేర ప్రజ్వల్‌ను అరెస్టు చేసేందుకు భారీ కసరత్తు సాగిస్తున్నట్లు తెలుస్తోంది

ప్రజ్వల్ ఏదేశంలో ఉన్నా వదిలే ప్రసక్తే లేదు

- సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నామని జర్మనీ కాదు దుబాయ్‌లో ఉన్నా పట్టుకొస్తామని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. శుక్రవారం బాగల్కోటెలో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రజ్వల్ జర్మనీ నుంచి దుబాయ్‌కు పరారీ అయినట్లు సమాచారం తెలుస్తోందని, అయితే ప్రజ్వల్ ఏ దేశంలో ఉన్నా వదిలే ప్రసక్తే లేదు. ప్రజ్వల్ డిప్లమాటిక్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని ప్రధానికి లేఖ రాశామన్నారు. పాస్‌పోర్ట్ రద్దు చేస్తే ప్రజ్వల్ విదేశాల్లో ఉండేందుకు వీలుండదన్నారు. పెన్‌డ్రైవ్‌లో బాధిత మహిళలను గుర్తించి వారికి రక్షణ కల్పించాలని పోలీసుశాఖకు సూచించామన్నారు. ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ లాయర్ వద్దకు ఎందుకు వెళ్లారని, దేవెగౌడ, కుమారస్వామిలు లాయర్‌ను పిలిపించుకుని ఎందుకు చర్చించారన్నారు. రేవణ్ణకు తనకు సంబంధం లేదనే కుమారస్వామి ఎందుకు జోక్యం చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజ్వల్‌ను తన కొడుకుగా చెప్పుకుని, వివాదం బయటకు వచ్చాక తనకు సంబంధం లేదనడం ఎంతవరకు సమంజసమన్నారు.

తుపాకీతో బెదిరించి లైంగిక దాడి



- బయటపెడితే నా భర్తను చంపుతానన్నాడు
- ఫొటోలు, వీడియోలతో పలుమార్లు వేధింపులు
- ప్రజ్వల్‌పై జేడీఎస్ మహిళా కార్యకర్త ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన సీఐడీ పోలీసులు

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై మరో మహిళ ఫిర్యాదు చేసింది. తుపాకీతో బెదిరించి లైంగిక దాడులకు పాల్పడ్డారని వీడియోలు, ఫొటోలు తీసి వాటి ద్వారా వేధించి పలుమార్లు దారుణానికి పాల్పడ్డారని 44 ఏళ్ల జేడీఎస్ కార్యకర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదుకు అనుగుణంగా సీఐడీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల మేరకు ప్రజాసేవ చేయాలనే తపన ఉండేదన్నారు. ప్రజలకు అవసరమైన పనులు చేయాలని అధికారులకు సూచించాలని ఎమ్మెల్యే రేవణ్ణ, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణల వద్దకు వెళ్లానన్నారు. కొన్ని నెలలక్రితం ఎంపీ ప్రజ్వల్ కార్యాలయానికి వెళ్తే బయటకు వెళ్లారని సిబ్బంది సూచించారన్నారు. రెండోరోజు రావాలని తెలిపిన మేరకు ప్రజ్వల్ క్వార్టర్స్‌కు వెళ్లానన్నారు. అక్కడ ప్రజ్వల్ వ్యక్తిగత సిబ్బంది ఫస్ట్‌ఫ్లోర్‌కు వెళ్లాలని సూచించారన్నారు. అక్కడ కొందరు మహిళలు ఉండగా ఎంపీ వారితో మాట్లాడి పంపేశారన్నారు. ఆ తర్వాత తాను ఒక్కరే ఉన్నప్పుడు చేయి పట్టుకుని ఓ గదిలోకి లాక్కెళ్లి తలుపులు వేశారన్నారు. తలుపులు ఎందుకు వేశారని కోరగా ఏం కాదులే అంటూ మాట్లాడారన్నారు. తన భర్త గురించి మాట్లాడారని, అతడి నుంచే తల్లి భవానికి ఎమ్మెల్యే టిక్కెట్ తప్పిందని చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బట్టలు తీయాలని, మంచంపైకి రావాలని సూచించారన్నారు. తాను అంగీకరించకుండా బయటకు వచ్చేందుకు ప్రయత్నించానని అప్పుడు తుపాకీ తీసి నేను చెప్పినట్లు వినకపోతే తనతో పాటు తన భర్తను హతమారుస్తానని బెదిరించారన్నారు. ఆ తర్వాత బట్టలుతీసి మొబైల్‌లో చిత్రీకరించారన్నారు. బయటకు వెళ్లిపోతానని మొరాయిస్తే అప్పటికే నగ్నంగా ఉన్న ఫొటోలు, వీడియోలు చూపి అందరికి పంపుతానని బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. వీడియోలతోనే పలుమార్లు క్వార్టర్స్‌కు రప్పించుకుని దౌర్జన్యం చేశారన్నారు. వీడియోకాల్ చేసి వేధించారన్నారు. ఎదురు తిరిగితే తన భర్తను హతమారుస్తాననే భయం వెంటాడిందన్నారు. సిట్ విచారణ ప్రారంభించినందుకే గోడు చెప్పుకొనేందుకు వచ్చానన్నారు. దీంతో ప్రజ్వల్‌పై మరో కేసు నమోదైనట్లు అయ్యింది.

సహృదయానికి సాక్ష్యం

- చిన్నారి గుండె ఆపరేషన్‌కు స్పందించిన దాతలు
- 48 గంటల్లో..రూ.60 లక్షలు
- మా ఖాతాకు డబ్బులు పంపకండి
- ఆపరేషన్‌కు సరిపడా డబ్బు సమకూరింది
- తల్లిదండ్రుల వినతి

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మానవత్వం కరువైపోయింది..ఈ కాలంలో స్పందించి సాయం అందించే మనుషులు లేరు అంటుంటారు..కానీ అది అబద్ధం అని నిరూపించారా దాతలు. కేవలం 48 గంటల వ్యవధిలోనే రూ.60 లక్షలు పంపి సహృదయానికి సాక్షులుగా నిలిచారు. ఐదునెలల పసికూన ప్రియోన్ స్యామ్‌కు అరుదైన గుండె వ్యాధికి ఆపరేషన్ తప్పనిసరి అయ్యింది. రెండురోజుల కిందట తల్లిదండ్రులు సోషల్ మీడియా ద్వారా తమకు ఆర్థిక స్థోమత లేదని, దాతలు సహకరించాలని సందేశాన్ని పంపారు. ఆపరేషన్‌కు కనీసం రూ.50లక్షలు అవసరమని వైద్యులు సూచించడంతో అదే విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కేవలం 48గంటల వ్యవధిలోనే చిన్నారి తండ్రి ఖాతాకు రూ.60.62లక్షల మేర నగదు వచ్చింది. వెంటనే తల్లిదండ్రులు సోషల్ మీడియా ద్వారానే మరో సందేశాన్ని పంపారు. తమ చిన్నారి ఆరోగ్యంపై స్పందించి సాయం అందించిన దాతలందరికీ రుణపడి ఉంటాం. మా చిన్నారి ఆపరేషన్‌కు అవసరమైన సొమ్ము కంటే అదనంగా పది లక్షలు సమకూరాయి. ఇక మా ఖాతాలకు డబ్బులు పంపకండి అంటూ సందేశాన్ని పంపారు. దక్షిణ కన్నడ జిల్లా కేంద్రం మంగళూరు కొణాజె నివాసి సంతోష్ మంతేరో, ప్రియా దంపతుల ఐదు నెలల కుమార్తె ప్రియోన్ స్యామ్ గుండెకు సంబంధించిన సమస్య నెలకొనడంతో బెంగళూరు నారాయణ హృదయాలయ ఆసుపత్రిలో చేర్చారు. తల్లిదండ్రుల అంత సొమ్ము భరించే స్థోమత లేక పోవడంతో ఆసుపత్రి నుంచే ఓ వీడియోను రికార్డు చేశారు. సదరు వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రెండురోజుల వ్యవధిలోనే ఆపరేషన్‌కు సరిపడా సొమ్ముకంటే అదనంగానే చేకూరడంతో శుక్రవారం చిన్నారి తల్లిదండ్రులు సంతోష్, ప్రియాలు మరో సందేశాన్ని పోస్టు చేశారు.



పసికందు ప్రియోన్ స్యామ్

సీఎం.. జర భద్రం..!

- డీకేశీ వద్ద పెన్‌డ్రైవ్ యూనివర్సిటీ ఉంది
- మిమ్మల్ని దించేందుకు వాడవచ్చు
- ఆయనకు సీఎం సీటుపై ఆశ ఉంది : సురపుర బీజేపీ అభ్యర్థి రాజుగౌడ



బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): 'అయ్యా సీఎం గారూ జాగ్రత్తగా ఉండండి..డీకేశీ మిమ్మల్ని దింపడానికి ప్రయత్నించవచ్చు' అని యాదగిరి జిల్లా సురపుర నియోజకవర్గం ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రాజుగౌడ సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. డీసీఎం డీకే శివకుమార్ వద్ద పెన్‌డ్రైవ్ యూనివర్సిటీ ఉందని, కుర్చీ నుంచి కిందకు దించేందుకు సీడీ విడుదల చేస్తారని సిద్దరామయ్య జాగ్రత్తగా ఉండాలని వ్యాఖ్యానించారు. సురపురలో శుక్రవారం బీజేపీ ప్రచార ర్యాలీలో మాట్లాడుతూ గతంలో మంత్రి రమేశ్‌జార్కిహొళి సీడీ విడుదల చేసి ఇంటికి పంపారన్నారు. ప్రస్తుతం ప్రజ్వల్ రేవణ్ణ పెన్‌డ్రైవ్ విడుదల వెనుక ఆయనపై ఆరోపణలు ఉన్నాయన్నారు. డీకే శివకుమార్ సీడీలు చేయడంలో ఎక్స్‌పర్ట్ అని మీరు పక్కనే ఉంటారని కొంచెం జాగ్రత్తలు పాటించాలని సీఎం సిద్దరామయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. డీకే శివకుమార్ అన్నకు సీఎం కావాలని ఆశ ఉందని, అవసరమైతే యతీంద్రది ఒక సీడీ చేస్తారన్నారు.

శక్తి గ్యారెంటీ లబ్ధిదారులు 200 కోట్లు

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించే శక్తి గ్యారెంటీ పథకం మరో మైలురాయిని అధిగమించింది. ఏప్రిల్ నెలాఖరుకు శక్తి గ్యారెంటీ ద్వారా 200 కోట్లమంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. రాష్ట్రంలోని 4 కార్పొరేషన్‌ల ద్వారా మహిళలు ఉచితంగా ప్రయాణాలను 2023 జూన్ 11న ప్రారంభమైంది. 200 కోట్ల మంది మహిళలు శక్తి గ్యారెంటీని సద్వినియోగం చేసుకున్నారు. శక్తి గ్యారెంటీ ప్రారంభమయ్యాక 4 కార్పొరేషన్‌ల ద్వారా 348.97 కోట్లమంది ప్రయాణం చేశారు. వీరిలో మహిళలు 200 కోట్లమంది ఉన్నారు. ఇప్పటివరకు రూ.4,836 కోట్ల విలువైన టిక్కెట్‌లు ఉచితంగా ఇచ్చారు. ఇటీవల మూడు నెలలుగా ప్రయాణీకుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. సరాసరిన 19 కోట్లమంది నెలకు ప్రయాణాలు సాగించేవారు. ఇటీవల రాష్ట్రమంతటా ఎండలు, మరోవైపు ఎన్నికలు, పండుగలు ఉండడంతో ప్రయాణీకుల సంఖ్య తగ్గింది. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ దాకా ప్రయాణీకులు సరాసరిన 18 కోట్ల చొప్పున ప్రయాణించారు. 63లక్షలమంది రోజూ బస్సుల్లో ప్రయాణిస్తుండగా వీరిలో 54లక్షలమంది మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది.



వైసీపీని 'బజ్జీ'చేసి పొట్లం కట్టేద్దాం..!



బజ్జీలు వేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం రూరల్, మే 3: 'ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని బజ్జీలలాగే సలసల కాగే నూనెలో వేయించి పొట్లం కట్టి పారేద్దాం' అని మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పాపంపేటలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో స్థానికంగా ఓ కొట్టులో బజ్జీలు వేస్తూ.. ప్రచారంలో టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. మహిళలు తలచుకుంటే ఏమైనా చేయగలరని..అందుకే ఎన్డీయే కూటమి మేనిఫెస్టోలో వారికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టారని ఆమె గుర్తు చేశారు.

రాష్ట్రాన్ని కాపాడేది ఈ సైకిలే..!

హిందూపురం, మే 3: ఆగిపోయిన రాష్ట్రాభివృద్ధి ముందుకు సాగాలన్నా, నిర్వీర్యమైన వ్యవస్థలు నడవాలన్నా ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటేయాలని తెలుగుదేశంపార్టీ నాయకులు వినూత్న ప్రచారం నిర్వహించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, మురళిస్వామితోపాటు కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా వీధుల వెంబడి సైకిల్‌ని ఎత్తుకుని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం అభివృద్ధి చెందాలంటే రెండు ఓట్లు ఈ సైకిల్ గుర్తుకు వేయాలని విజ్ఞప్తి చేశారు.



వీధుల్లో సైకిల్‌ని ఎత్తుకుని వెళ్తూ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ఐదేళ్లయినా అక్కడే..!

5 శాతమే పెండింగ్... ముందుకు సాగని వైనం... షాదీఖానా నిర్మాణంలో నిర్లక్ష్యం



కల్లూరులో నిలిచిపోయిన షాదీఖానా

గార్లదిన్నె: జగన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో నిండా నిర్లక్ష్యం వహించింది. మండలంలోని కల్లూరులో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నారు. 2018లో ముస్లింల సంక్షేమానికి టీడీపీ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి సుమారు రూ.15 లక్షలు సొంత డబ్బుతో స్థలం కొనుగోలు చేసి షాదీఖానా కోసం ఇచ్చారు. షాదీఖానా నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే యామినీబాల రూ. 35 లక్షలు నిధులు మంజూరు చేయించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 95 శాతం పూర్తయింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే షాదీఖానా భవన నిర్మాణం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో 5 శాతం పనులు పూర్తి చేయకపోవడంతో ముస్లింలు మండిపడుతున్నారు. షాదీఖానా పనులు పూర్తి చేయకుండా ముస్లింలపై చిన్నచూపు చూస్తున్నారని ఆ వర్గానికి చెందిన పలువురు వైసీపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీలపై వైసీపీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ముస్లింలకు వైసీపీ మొండిచేయి చూపింది అనేందుకు కల్లూరులోని షాదీఖానానే నిలువెత్తు నిదర్శనమన్నారు. ముస్లింలపై జగన్‌రెడ్డి కపట ప్రేమను కురిపిస్తున్నరని ఆరోపిస్తున్నారు.

ఉద్యోగులకు చుక్కలు

సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.. రోడ్డెక్కించారు

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై వైసీపీ కక్షసాధింపు

మాట మార్చి...మడమ తిప్పిన సీఎం జగన్

గాలిలో కలిసిపోయిన సీపీఎస్ రద్దు హామీ

పీఆర్సీ అమలులో మోసం... బకాయిల చెల్లింపు పట్టని వైనం




శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు (ఫైల్)

ధర్మవరం, మే 3: అధికారంలోకి రాగానే వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తాం.. ఫ్రెండ్లీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం.. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం.. అని గత ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి...మడమ తిప్పారు. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చారు. ప్రతినెలా పెన్షన్లు, జీతాలకు ఎదురు చూసేలా చేశారు. పీఆర్సీ, డీఏ తదితర బకాయిలతో పాటు సకాలంలో పీఎఫ్ సొమ్మును కూడా చెల్లించకలేకపోయారు. ఎన్నడూ లేనివిధంగా వాటి కోసం రోడ్డెక్కేలా చేశారు. ఆందోళనలు చేసిన వారికి నోటీసులు ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలను గృహ నిర్బంధాలు, అక్రమ కేసులు, బైండోవర్‌తో కట్టడి చేశారు. మొత్తంగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను కక్ష సాధింపులకు గురిచేసింది.

ఇదీ పరిస్థితి..

శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు సుమారు 20వేలకు పైగా ఉన్నారు. వారు కాకుండా సచివాలయ పరిధిలో ఉద్యోగులు ఉన్నారు. వారంతా గత ఎన్నికల్లో జగన్ మాటలు నమ్మి వైసీపీకి ఓటు వేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని అనేక అవమానాలకు గురిచేశారు. ఎన్నికల్లో గెలిచాక సీపీఎస్ రద్దుపై మాట్లాడాలంటే ఉద్యోగులకు అపాయింట్‌మెంట్



విశ్రాంత ఉద్యోగులు కూడా పెన్షన్ కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్నిసార్లు 12వ తేదీ వరకు జీతాలు, పెన్షన్లు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసింది. ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి

ఇవ్వలేదు. ప్రభుత్వం కొలువుదీరిన రెండేళ్ల మౌనంగా ఉన్న ఉద్యోగులు తరువాత ఉద్యమబాట పట్టారు. దీన్ని అడ్డుకునేందుకు అడుగడుగునా ప్రభుత్వం ప్రయత్నించినా ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ పోరాటాన్ని కొనసాగించారు. చివరికి ప్రభుత్వం చర్చలకు పిలిచి జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్) అంటూ కొత్తరాగం అందుకుంది. ఇది కూడా తమను మోసం చేసేదేనంటూ ఉద్యోగులు మళ్లీ ఆందోళనలు కొనసాగించారు. హక్కుల కోసం పోరాడుతున్నవారిపై పరోక్ష రూపంలో వైసీపీ క్షోభ పెట్టింది. గతంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతం వచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. ప్రతినెలా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి.

నెలా ఒకటో తేదీకి జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. బ్యాంకు ఈఎంఐలు సకాలంలో కట్టలేక అవస్థలు పడ్డారు. పెన్షనర్లు వైద్యం, మందులు ఖర్చులకు ఇబ్బందులు పడ్డారు.

- గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించే పరిస్థితి ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించినా స్పందించకపోవడంతో వివిధ రూపాల్లో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.
- ఉద్యోగులకు జీపీఎస్, డీఏ, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ బకాయిలు ఇతర అలవెన్సులు జగన్ ప్రభుత్వం చెల్లించలేదు. ఐదేళ్లగా ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకోలేని పరిస్థితి.
- ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కూడా భారంగా మారింది. నిధులు కేటాయించక పోవడంతో సుద్దముక్కలు, రిజిస్టర్లు, డస్టర్లు ఇతర సామాగ్రి కొనుగోలుకు కొందరు ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సొంత డబ్బులను వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా సమగ్రశిక్షణ ద్వారా విద్యార్థుల సంఖ్యను బట్టి స్కూళ్లకు నిధులు మంజూరు చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి లేదు.
- మధ్యాహ్న భోజనం, ఆన్‌లైన్ హాజరు నమోదు, మరుగుదొడ్ల శుభ్రత ఫోటోలు అప్‌లోడ్, నాడు-నేడు పనుల బాధ్యతతో టీచర్లపై పనిభారం పెరిగింది. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లుల చెల్లింపులు కాకపోవడంతో పలువురు ఉద్యోగులు తమ శుభకార్యాలు, పిల్లల చదువులకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

పీఆర్సీ ఇలా..

వైసీపీ ప్రభుత్వం 11వ పీఆర్సీలో ఉద్యోగులను మోసం చేసింది. ఎన్నడూ లేని విధంగా మధ్యంతర భృతి 27 శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి తగ్గించి 23 శాతం ఫిట్మెంట్ ఇచ్చింది. దీంతో ఐఆర్‌తో తీసుకున్న జీతం కంటే ఫిట్మెంట్‌తో తీసుకున్న జీతం తగ్గిపోయింది. దీనిపై కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పీఆర్సీ సిఫారసు చేసిన పేస్కేలును పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే 12వ పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌ను వేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. వాస్తవంగా 2023 జూలై నుంచి కొత్త పీఆర్సీ కమిషన్ అమలు కావాలి. ఇదిలా ఉండగా ప్రతిసారిలానే వైసీపీ ప్రభుత్వం ఐఆర్‌కూ మంగళం పాడేసింది. దీనిపై ఉద్యోగుల సంఘాల నాయకులు నేటికి ఆవేదన చేస్తున్నారు.

జగన్‌కు ఓటు వేస్తే నాశనమే

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్



మాట్లాడుతున్న షరీఫ్

పెనుకొండ టౌన్, మే 3: ఈసారి జగన్‌కు ఓటేస్తే మన రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి షరీఫ్‌తోపాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ పాల్గొని మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీజేపీని మైనార్టీలకు బూచిగా చూపిస్తూ డ్రామాలు ఆడుతున్నార న్నారు. పొత్తు కొత్తగా పెట్టుకోలేదని, గతంలోనే పొత్తు కొనసాగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం మైనార్టీలలో అనేకమంది రాజకీయంగా, విద్యా, ఉద్యోగరంగంలో బాగా రాణిస్తున్నారని వారు ఇలాంటి గిమ్మిక్కులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 120స్థానాల్లో టీడీపీ గెలవడం ఖాయమన్నారు. మిత్ర పక్షాలు 20సీట్లు గెలుస్తాయన్నారు. జూన్ 9న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నార న్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు దాదు, సామిల్ షౌకత్, బోలోని స్సార్, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, కేశవయ్య, వెంకటరమణ, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దారి కష్టాలు తీరేదెన్నడో..?

మడకశిర నియోజకవర్గంలో రూ. 144 కోట్ల పనులు రద్దు

పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి మారినా అంతే..

జగన్ ప్రభుత్వంలో మరమ్మతులూ కరువే



పూలపల్లి- అగళి రోడ్డు



బంద్రేపల్లి రోడ్డు

మడకశిర, మే 3 : తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో మంజూరు చేసిన పనులను వైసీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేయడంతో పలు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు ప్రయాణం సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి కి నిధులు మంజూరు చేసి, టెండర్లు, అగ్రిమెంట్లు కూడా పూర్తి చేసింది. పనులు కూడా కొంత మేర జరిగాయి. ప్రభుత్వం మారడంతో 25శాతం లోపు జరిగిన పనులు రద్దు చేసి, 25 శాతం పైబడి జరిగిన పనులు కొనసాగించే విధంగా నిర్ణయం తీసుకుంది. మడకశిర నియోజకవర్గంలో సుమారు రూ.144 కోట్లకు సంబంధించి పనులు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. తర్వాత రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు చేయలేదు. దీంతో ఆ రోడ్లలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం మడకశిర నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.144 కోట్లు మంజూరు చేసింది. ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.60 కోట్లు మంజూరు కాగా ఇందులో భూసేకరణకు రూ.10 కోట్లు, రోడ్డుకు 50 కోట్లు కేటాయించింది. నియోజకవర్గ పరిధిలో ఆరు రోడ్లకు రూ. 50 కోట్లు, కిరికెర, మోర్‌బాగల్ వయా హేమావతి రోడ్డుకు రూ. 20 కోట్లు కేటాయించింది. అమరాపురం - విరూపసముద్రం రోడ్డుకు రూ.24 కోట్లు నిధులు మంజూరు చేశారు. టెండర్లు ప్రక్రియ ముగిసి పనులు కూడా ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో 25 శాతం లోపు జరిగాయని రూ.144 కోట్ల పనులు రద్దు చేసింది. మూడు సంవత్సరాలు దాటిపోయినా ఇప్పటి వరకు ఆ రోడ్లకు నిధులు మంజూరు కాలేదు. ఆ రోడ్ల నిర్మాణాలు పూర్తయి ఉంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ఉండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పూర్తయి ఉంటే మడకశిర రూపురేఖలు మారిపోయి ఉండేవని స్థానికులు అంటున్నారు. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఆర్ అండ్ బీ పరిధిలోకి పలు రోడ్లను బదలాయించి నాలుగు సంవత్సరాలు దాటిపోయినా తర్వాత వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీరాజ్ నుంచి ఆర్‌బీ పరిధిలోకి 258 కిలో మీటర్ల రోడ్లను బదలాయించారు. మడకశిర మండలంలో 70 కిలో మీటర్లు, అగళిలో 60 కి.మీ, రొళ్లలో 50 కి.మీ, గుడిబండలో 40 కి.మీ, అమరాపురం మండలంలో 38 కిలో మీటర్ల రహదారులను ఆర్ అండ్ బీ పరిధిలోకి మార్చారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్నప్పుడు మెటల్ వేసి మట్టిని వేశారు. శాఖ మారిందే కానీ రోడ్ల పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో ఆ రోడ్లు వర్షాలకు మరింత దెబ్బతిని గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న బీకే, కందికుంట



ఎర్రకవంకపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీకే, పల్లె కిశోర్‌రెడ్డి

ధర్మానికి.. అధర్మానికి యుద్ధం

బీకే పార్థసారథి

కదిరి, మే 3: ప్రస్తుత ఎన్నికల్లో ధర్మానికి, అధర్మానికి యుద్ధం జరుగుతోందని హిందూపురం పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. తలుపుల మండలకేంద్రంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ తొలుత శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో ధర్మం వైపు టీడీపీ కూటమి ఉందని, అధర్మం వైపు వైసీపీ ఉందని అన్నారు. సీఎం జగన్ ఓటమి భయంతోనే కూటమిపై అపద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి అధర్మ ముఖ్యమంత్రిని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధమవ్వాలన్నారు. ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా, కందికుంట వెంకటప్రసాద్‌ను ఎమ్మెల్యే గెలిపించాలని పిలుపునిచ్చారు. తర్వాత ఆయన పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండలం ఎర్రవకంపల్లిలో యువ నాయకుడు పల్లె కృష్ణకిశోర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అక్కడ 60కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వారికి బీకేతో పాటు కృష్ణకిశోర్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఓడీసీ మండలం గాజుకుంటపల్లిలో కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, టీడీపీ గెలుపునకు కృషిచేయాలని, ఉన్న కొద్ది రోజుల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేయాలని సూచించారు.

శంకుస్థాపన సరే.. రోడ్డేదీ..?



అర్ధంతరంగా ఆగిపోయిన రహదారి పనులు

కళ్యాణదుర్గం రూరల్, మే 3: వైసీపీ ప్రభుత్వ అభివృద్ధి పనులు శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కుందుర్పి మండలం జంబగుంపల గ్రామం నుంచి వెంకటాంపల్లి వరకు తారు రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉషశ్రీచరణ్ 2020లో శంకుస్థాపన చేసి వదిలేశారు. మూడు కిలోమీటర్లు తారు రోడ్డు కొరకు ఏఐఐబీ నిధులు 401.00 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు గ్రామాల మధ్య రహదారులు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల మధ్య వంక ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు.



రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం

కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా



మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

రాయదుర్గం, మే 3: తెలుగుదేశం పార్టీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని కూటమి పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాయదుర్గంలోని అజీజీయా షాదీమహల్‌లో ముస్లిం మైనార్టీల తో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. రాయదుర్గం నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి శాసనమండలి మాజీ అధ్యక్షులు షరీఫ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ కేంద్రం సహకారం కోసమే టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకుందన్నారు. బీజేపీ విధానాలు, సిద్ధాంతాలతో తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా సామరస్యాన్ని కాపాడే విధంగా లౌకికవాదాన్ని పెంపొందించే విధంగా చంద్రబాబునాయుడు పాలన ఉంటుందని పేర్కొన్నారు. గతంలో పలుసార్లు టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ మైనార్టీలకు ఎలాంటి హానీ కలగలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. పలు ఆర్థిక నేరాలల్లో 16 నెలలు జైలు శిక్ష అనుభవించిన జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉన్న ల్యాండరింగ్, సీబీఐ కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీకి తొత్తుగా వ్యవహరించారని విమర్శించారు. దాదాపు 32 కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ జైలు పాలు కావాల్సి వస్తుందన్న నెపంతో ఐదేళ్లపాటు బీజేపీకి సానుకూలంగా వ్యవహరించాడని ధ్వజమెత్తారు. ముస్లింలపై మైనార్టీల సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని పేర్కొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొలమ్...

త్యాగరాజస్వామి (జయంతి)



కర్ణాటక సంగీతానికి మూల స్తంభంగా నిలిచి నాదోపాసన ద్వారా భగవంతుడిని తెలుసుకోవచ్చునని నిరూపించిన వాగ్గేయ కారుడు, త్యాగయ్య, త్యాగబ్రహ్మ పేర్లతో పేరొందారు. త్యాగరాజ స్వామి 1767 మే 4న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరువారూర్ గ్రామంలో జన్మించారు. కర్ణాటక సంగీతత్రయంలో శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు సమకాలికుడు. తమిళదేశంలో పుట్టినా తెలుగు, సంస్కృతంలోనే ఎక్కువగా ఆయన గానాలున్నాయి. ప్రత్యేకించి శ్రీరాముడు, వేంకటేశ్వర స్వామిపై ఆయన రచనలు, కీర్తనలు సంగీతసాహిత్య ప్రియులను అలరిచాయి. పుష్య బహుళ పంచమిని త్యాగరాజ ఆరాధనోత్సవంగా నిర్వహిస్తారు. 1847 జనవరి 6న పరమపదించారు.

దాసరి నారాయణరావు (జయంతి)



'దర్శకరత్న'గా పేరొందిన దాసరి నారాయణరావు 1947 మే 4న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. సినీ దర్శకుడు, నిర్మాత, స్క్రిప్ట్ రైటర్, డైలాగ్ రైటర్, నటుడు, సినీ గీతాల రచయిత, రాజకీయ నేతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు సినీరంగంలో తనదైన చరిత్ర సృష్టించుకున్నారు. 3 జాతీయ అవార్డులు, 9 నంది అవార్డులు, 4 ఫిల్మ్‌ఫేర్, రఘుపతి వెంకయ్య అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలోనూ నటించారు. 'మేఘసందేశం' సినిమా ఇండియన్ పనోరమలో ప్రదర్శించబడింది. 2017 మే 30న కన్నుమూశారు.

ఆడ్రీ హెప్‌బర్న్ (జయంతి)



ఆడ్రి హెప్‌బర్న్ 1929 మే 4న బెల్జియంలో జన్మించారు. బ్రిటీష్‌కు చెందిన నటి. అంతేకాక మానవతావాదిగా రాణించారు. సినీ రంగంలోనూ, ఫ్యాషన్ ఐకాన్‌గాను గుర్తింపు పొందారు. అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌చే 'థర్డ్ గ్రేటెస్ట్ ఫిమేల్ స్క్రీన్ లెజెండ్'గా గుర్తింపు పొందారు. ఆస్కార్, గోల్డెన్ గ్లోబ్ అవార్డ్, బాఫ్టా అవార్డులు అందుకున్న నటి. ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియా తదితర ఖండాల పేదలకు తనవంతు చేయూత ఇచ్చి యూనిసెఫ్ రాయబారిగా వ్యవహరించారు. 1993 జనవరి 20న కన్నుమూశారు.

సిక్కిల్ ఆర్ భాస్కరన్ (జయంతి)



సిక్కిల్ ఆర్ భాస్కరన్ 1936 మే 4న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లాలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో వయొలిన్ కళాకారుడిగా పేరొందారు. కంచి కామకోటి పీఠంలో ఆస్థాన విద్వాన్‌గా వ్యవహరించారు. చెన్నై మ్యూజిక్ అకాడమీ బంగారు పతక గ్రహీత. రేడియోలో రెండు దశాబ్దాలపాటు ఏ గ్రేడ్ కళాకారుడు. కళైమామణి, గానకళా భారత, సంగీత కళామృత తదితర పురస్కారాలు పొందారు. 2021 జూలై 20న కన్నుమూశారు.

క్రాఫ్ట్ మేళాను సద్వినియోగం చేసుకోండి



మేళాలో దేవతా సామగ్రి

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ డిజైన్‌లు, చేనేత వస్త్రాలు, లోహపు పాత్రలు ఒకేచోట లభించేలా నగరంలోని చిత్రకళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ నటి కవితాగౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం మేళాను లాంఛనంగా ప్రారంభించారు. ఈనెల 12వరకు మేళా ఉంటుందన్నారు. చేతి వృత్తుల కళాకారులను ప్రోత్సహించేలా మేళాను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

తమ్ముడిని హతమార్చిన అన్న

గుంతకల్లుటౌన్, మే 3: మండలంలోని నాగసముద్రం గ్రామంలో అన్న నారాయణరెడ్డి చేతిలో తమ్ముడు రామకృష్ణారెడ్డి (30) హత్యకు గురయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన నాగిరెడ్డి, లక్ష్మీనారాయణమ్మకు ఇద్దరు కుమారులు నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నారాయణరెడ్డి పుట్టకతో నుంచి మూగ, చెవడు ఉందన్నారు. నారాయణరెడ్డి అక్కకు అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. నారాయణరెడ్డి అక్క ఇంట్లో ఉండేవాడన్నారు. గురువారం ప్రభుత్వ పింఛన్ డబ్బులతో మద్యం సేవించి చికెన్ తీసుకుని అక్క ఇంట్లో వండుకొని తిని ఇంట్లో చికెన్, అన్నాన్ని ఎక్కడపడితే అక్కడ పడేశాడన్నారు. బాలమ్మ భర్త పెద్దిరెడ్డి ఈ విషయాన్ని రామకృష్ణారెడ్డిని ఇంటికి పిలుచుకొని వచ్చి మీ అన్న ఇలా చేశాడని చూపించాడన్నారు. ఇలా చేయడం తప్పుకదా అని నారాయణరెడ్డిని మందలించాడన్నారు. ఈ విషయం నారాయణరెడ్డి మనసులో పెట్టుకున్నాడన్నారు. రామకృష్ణారెడ్డి తన ఇంటి బయట మంచంపై పడుకుని ఉండగా అర్ధరాత్రి నారాయణరెడ్డి కట్టెతో తలపైన కొట్టి చంపాడన్నారు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రామకృష్ణారెడ్డికి భార్య వాణి, ఏడు సంవత్సరాల కూతురు ఉందన్నారు. అక్క బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

బెళగావి పోరు రసవత్తరం

● బీజేపీ నుంచి బరిలో మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ ● కాంగ్రెస్ నుంచి మంత్రి తనయుడు మృణాల్ హెబ్బాల్కర్





బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): రెండో విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే బెళగావిలో పోరు రసవత్తరమైంది. అనాదిగా బీజేపీకి కంచుకోటగా ఉండే స్థానం ప్రస్తుత సమరంలో విజయం ఎవరు సాధిస్తారనేది కుతూహలంగా మారింది. ఇక్క డ ప్రధాన అభ్యర్థులు ఇద్దరూ లింగాయత సామాజికవర్గానికి చెందినవారే. బీజేపీ నుంచి సీనియర్ నేత జగదీశ్ శెట్టర్, కాంగ్రెస్ నుంచి మృణాల్ హెబ్బాల్కర్ బరిలో ఉన్నారు. సురేశ్ అంగడి వరుసగా నాలుగుసార్లు ఎంపీగా రాణించారు. కేంద్రరైల్వే మంత్రిగా కొనసాగుతున్న తరుణంలోనే కొవిడ్ కారణంగా అకాలమృతి చెందడంతో ఉప ఎన్నికలలో భార్య మంగళ అంగడి బరిలో దిగి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికలలో మాజీ ముఖ్యమంత్రి జగదీశ్‌శెట్టర్ బరిలోకి నిలవడంతో ఇక్కడ పోరు ఆసక్తిగా మారింది. శెట్టర్‌కు పోటీగా కాంగ్రెస్ నుంచి రాష్ట్ర కేబినెట్‌లో ఉండే ఏకైక మహిళా మంత్రి లక్ష్మీహెబ్బాల్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాల్కర్ తొలిసారిగా ఎంపీ బరిలో నిలిచారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కల్గిన జగదీశ్‌శెట్టర్ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్షనేతగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరించారు. అయితే కొంత కాలంగా తల్లిచాటు రాజకీయాలు చేస్తూ వచ్చిన మృణాల్ ప్రత్యక్ష ఎన్నికలలో ఎంపీగా పోటీ చేస్తున్నారు. శెట్టర్‌కు ప్రధాని మోదీ హవా, వ్యక్తిగత ఇమేజ్ కలసి రానుండగా మృణాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలు, తల్లి లక్ష్మీ హెబ్బాల్కర్ ఈ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ప్లస్‌గా ఉంది.

8 శాసనసభ నియోజకవర్గాలు

బెళగావి (బెల్గాం) లోక్‌సభ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. అరబావి (బీజేపీ), రామదుర్గ (కాంగ్రెస్), సవదత్తి యల్లమ్మ (కాంగ్రెస్), బైలహొంగల (కాంగ్రెస్), గోకాక్ (బీజేపీ), బెళగావి దక్షిణ (బీజేపీ), బెళగావి గ్రామీణ (కాంగ్రెస్), బెళగావి ఉత్తర (కాంగ్రెస్)లు ఉండగా కాంగ్రెస్ నుంచి ఐదుగురు, బీజేపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

ప్రధాన అంశాలు

బెళగావిలో సువర్ణసౌధ ఉంది. బెంగళూరు విధానసౌధలో సాధారణ శాసనసభ సమావేశాలు నిర్వహిస్తుండగా ఏటా శీతాకాల సమావేశాలు సువర్ణసౌధలో నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. అయితే రాష్ట్రస్థాయి కార్యాలయాలు ఇక్కడ ఏమీ లేకపోవడం నిరాశ కలిగించే అంశం. తరచూ ఎంఈఎస్ సంఘాలు భాష, సరిహద్దు వివాదాన్ని లేవనెత్తడం సమస్యగా మారింది. పారిశ్రామిక వాడలు కల్పిస్తామన్న హామీ నెరవేరకపోవడం, సరిహద్దు ప్రాంతం కావడంతో కన్నడ పాఠశాలలకు సౌకర్యాల కొరత, ధార్మిక కేంద్రాలలో తగినన్ని మౌలిక సదుపాయాలు లేకపోవడం, పర్యాటక రంగానికి ప్రాధాన్యం కల్పించకపోవడం నిరాశ కలిగించే అంశాలు.

19.04 లక్షల ఓటర్లు

బెళగావి లోక్‌సభ పరిధిలో 19,04,099మంది ఓటర్లు ఉండగా వీరిలో 9,55,725మంది మహిళలు, 9,48,282 మంది పురుషులు, 92మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. నియోజకవర్గంలో లింగాయతల ప్రాబల్యం ఉండడంతో శెట్టర్‌కు కలసి రానుందనే అంచనాలు ఉన్నాయి. జిల్లాకు బయటవారనే విమర్శలు, కాంగ్రెస్‌కు వెళ్లి మళ్లీ బీజేపీలో చేరారనే అంశం శెట్టర్‌కు మైనస్‌గా ఉంది. ఇక మృణాల్ హెబ్బాల్కర్‌కు కుటుంబ రాజకీయాలు, ఇతరత్రా మైనస్‌గా ఉన్నాయి.

● ఆరంభంలో గో బ్యాక్ అభియాన ఎదుర్కొన్నా ప్రస్తుతం ప్రచారంలో చురుగ్గా ఉన్నారు. బైలహొంగలలో మూడు దిక్కులుగా ఉన్న జగదీశ్‌శెట్టర్ మద్దతుదారులు ప్రస్తుతం ఏకమయ్యారు. జగదీశ్‌శెట్టర్ ప్రారంభంలో జిల్లాకు బయట వారనే విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం బీజేపీ వర్గీయులందరూ దాదాపు ఒక్కటిగా చేరడం అనుకూలమైంది. అయితే బీజేపీ అగ్రనేతలు రమేష్‌జార్కిహోళి, రమేష్‌కత్తి, ప్రభాకర్‌కొరెలు పూర్తి స్థాయిలో సహకరించాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



● 2014లో లక్ష్మి హెబ్బాల్కర్, సురేశ్ అంగడిపై పోటీ చేసి ఓటమి చెందారు. పదేళ్ల తర్వాత కుమారుడు మృణాల్‌ను లోక్‌సభ బరిలోకి దించారు. 2021 ఉప ఎన్నికల్లో సతీశ్ జార్కిహోళి కూడా ఓటమి చెందారు. ప్రస్తుతం సతీశ్ జార్కిహోళి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎలాగైనా గెలుపు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ ప్రాంత రాజకీయ ప్రముఖుడు ఎమ్మెల్యే లక్ష్మణ్ సవది కూడా కాంగ్రెస్‌లో చేరడం మృణాల్‌కు కలసి రానుంది. 8 నియోజకవర్గాలకు గాను ఐదింట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ఆదరణ పొందాయి. ఇలా ఉండగా రాష్ట్రంలో ప్రభుత్వం ఏది ఉన్నా దేశానికి నరేంద్రమోదీ కావాలనే నినాదాన్ని బీజేపీ బలంగా ప్రతిపాదిస్తుండడంతో ఇక్కడ రెండు పార్టీలకు గెలుపు ప్రతిష్ఠాత్మకంగా మారింది.

ప్రజ్వల్‌ను కఠినంగా శిక్షించాలి



ప్రజ్వల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

బంగారపేట, మే 3: హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వ్యవహారాన్ని ఖండిస్తూ పట్టణంలో శుక్రవారం నిరసన చేపట్టారు. మహిళా దౌర్జన్య నియంత్రణ పోరాట సమితి, మహిళా కాంగ్రెస్, ఫోకస్ సంస్థ సంయుక్తంగా నిరసన తెలిపాయి. లైంగిక దాడుల కేసుల్లో నిందిడుతు ప్రజ్వల్‌ను రాష్ట్రంనుంచి తరిమేయాలని డిమాండ్ చేశారు. మహిళల జీవితాలతో చెలగాటమాడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫోకస్ సంస్థ అధ్యక్షులు ఆ.నా. హరీశ్ మాట్లాడుతూ బీజేపీ నాయకుడు దేవరాజేగౌడ అనే వ్యక్తి తన వద్ద 2వేలకుపైగా ఫోటోలు, వీడియోలు ఉన్నాయనే అంశాన్ని పార్టీ హైకమాండ్‌కు తెలిపానని చెప్పారన్నారు. ఆయన మాటలు విశ్లేషిస్తే బీజేపీ వారే అశ్లీల వీడియోలను సోషల్‌మీడియాలో వైరల్ చేసి ఉంటారన్న అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. ఏదేమైనా నిందితుడికి కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. బాధితుల గోప్యతను కాపాడాలన్నారు. ప్రజ్వల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలో పెద్దసంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వదేశీ బాంబర్ యూఏవీ ఆవిష్కరణ



ఎయిర్‌క్రాఫ్ట్ ఎఫ్‌డబ్ల్యుడీ 200 ఆవిష్కరణలో సంస్థ ప్రముఖులు, సిబ్బంది

బొమ్మనహళ్ళి, మే 3: స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన (యూఏవీ) మానవరహిత బాంబర్ డ్రోన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఎఫ్‌డబ్ల్యుడీ 200 ను ఎలక్ట్రానిక్‌సిటీలో శుక్రవారం ఆవిష్కరించారు. ఫ్లైయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ అనే ప్రైవేట్ సంస్థ దీన్ని రూపొందించింది. సంస్థ ఎండీ సుహాస్ తేజస్కంద మీడియాతో మాట్లాడుతూ దేశ రక్షణా వ్యవస్థకు దోహదపడే డ్రోన్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను రూపొందించినట్టు తెలిపారు. 500 కేజీల సామర్థ్యం, గంటకు 200-350 కిలోమీటర్ల దూరం వెళ్లే వీలుందన్నారు. పూర్తిగా దేశవాళీ సాంకేతికతను వినియోగించామని దాదాపు 25కోట్లు ఖర్చు అయ్యిందని మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందన్నారు. ఏడాదిపాటు కృషి చేశామని 70మంది ఆటోమొబైల్ నిపుణులు పాల్గొన్నారన్నారు.

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వర్షం





బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఎండకు తల్లడిల్లుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం అనిపించింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండల ధాటికి ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. 3 గంటల తర్వాత నగర వ్యాప్తంగా వర్షం కురిసింది. పలు చోట్ల రోడ్లపై నీరు ప్రవహించింది. మొత్తమ్మీద శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షం కురవడంతో ఒకింత ఊరట చెందారు. కాగా జ్ఞానభారతి సమీపంలో కాలువ అడ్డగోడ తొలగడంతో జనం ఇబ్బంది పడ్డారు.

కరాటేతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

శిడ్లఘట్ట, మే 3: కరాటే నేర్చుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యంతోపాటు క్రమశిక్షణ సాధ్యమని అంతేకాక ఆత్మ రక్షణకు ఎంతో ఉపకరిస్తుందని కరాటే ట్రైనర్ అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బసవేశ్వర ఆలయ మైదానంలో శుక్రవారం ఏర్పాటైన జై భారత్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 రోజుల తర్ఫీదును పూర్తి చేసినవారికి ప్రమాణపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవులను కేవలం మొబైల్‌తో కాలక్షేపం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 40మందికిపైగా పిల్లలు శిబిరంలో పాల్గొన్నారన్నారు. కరాటేతో దేహ దారుఢ్యం పెంపొంది చురుగ్గా ఉండేలా చేస్తుందన్నారు. అంతే కాక ఆత్మవిశ్వాసం పెంపొందేందుకు దోహదపడుతుందన్నారు. వేసవి సెలవుల్లో ప్రకృతితో దగ్గరయే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పర్యావరణానికి దోహదపడాలని సూచించారు.

ఘనంగా అణ్ణమ్మదేవి ఉత్సవం



పురవీధులలో అణ్ణమ్మదేవి ఊరేగింపు

బొమ్మనహళ్ళి, మే 3: బేగూరు రోడ్డులోని గణపతి ఆలయం వద్ద అణ్ణమ్మదేవిని కొలువు దీర్చారు. శుక్రవారం పురవీధులలో ఊరేగించారు. గ్రామజాతరలో భాగంగా శనివారం రాత్రి వివిధ ఆలయాలనుంచి పల్లకీలలో దేవతల ఊరేగింపు జరగనుంది. మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయి.

రూపేన అగ్రహారలో రథోత్సవం

రూపేన అగ్రహారలో లక్ష్మీవెంకటరమణస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. మూడు రోజులపాటు ఆలయ ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

స్కౌట్స్ వేసవి శిబిరం



శిడ్లఘట్ట, మే 3: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వేసవి శిబిరం శిడ్లఘట్ట పట్టణంలోని ఎస్ఆర్ సిటిజన్ కళాశాలలో ఏర్పాటైంది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామచంద్రరెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ విద్యార్థులు చక్కటి భావి పౌరులుగా రూపుదిద్దుతారన్నారు. దేశభక్తి, పెద్దలు, తల్లిదండ్రులు చెప్పినట్టుగా గౌరవించి ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీశ్ మాట్లాడుతూ ఈ ఏడాది గవర్నర్ మెడల్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. గైడ్స్ టీచర్ సత్యజ్యోతి, తాలూకా ట్రైనర్, పాఠశాల స్కౌట్స్ టీచర్ డాక్టర్ నాగరాజు శిబిరాన్ని పర్యవేక్షించారు. దేశభక్తి గీతాలు, దేశవాళీ ఆటలు, కాగితపు కళలు, మంటలు లేకుండా వంట తయారీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్దేశ్యాలు, లక్ష్యాలు వివరించారు. శిబిరం సంస్థ కార్యదర్శి అనిల్ శౌరి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అక్షర విన్యాసం సదస్సుకు ఫ్రాన్స్ విద్యార్థులు



ఫ్రాన్స్ విద్యార్థుల బృందం

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): అక్షర విన్యాసంపై లీసా స్కూల్ ఆఫ్ డిజైనింగ్ విద్యార్థులు జరిపిన సదస్సుకు ఫ్రాన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం నగరంలోని లీసా స్కూల్ ఆఫ్ డిజైనింగ్‌లో జరిగిన చర్చాగోష్టిలో ఇంగ్లిష్ అక్షరమాలలో 26 కాగా 27వ అక్షరాన్ని విన్యాసం విషయమై చర్చ జరిపారు. తద్వారా ఇంగ్లిష్, ఫ్రెంచ్ భాషలలో ఉండే వ్యత్యాసాన్ని తగ్గించవచ్చునని అభిప్రాయపడ్డారు. బెంగళూరు లిసా స్కూల్ డైరెక్టర్ అవికిస్వానితో పాటు పలువురు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై నిర్లక్ష్యం తగదు



పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ రంజన్‌శెట్టి

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గుండెజబ్బుల పట్ల నిర్లక్ష్యం తగదని మణిపాల్ ఆసుపత్రి హృద్రోగ నిపుణుడు రంజన్‌శెట్టి అభిప్రాయపడ్డారు. మారతహళ్ళి చిక్కబెళ్ళందూరులో బెల్‌నెస్ చాంపియన్ హాస్పిటల్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రంజన్‌శెట్టి మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు పాటించాలని అభిప్రాయపడ్డారు. మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలని శరీరానికి ప్రతిరోజూ తగిన వ్యాయామం ముఖ్యమన్నారు. ప్రజలకు అందుబాటులో ఆసుపత్రులు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. బెల్‌నెస్ ఆసుపత్రి సంస్థాపకుడు మంజునాథ్ మాట్లాడుతూ ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకు రావాలనే ఏర్పాటు చేశామన్నారు. స్థానిక బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి క్లినిక్‌ను ప్రారంభించారు. వైద్య నిపుణులు భరత్‌నందన్, ప్రదీప్ పసన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ కేసులో పనిమనిషి అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగలు, నగదుతో కమిషనర్

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): జేపీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ దంపతులు నివసించే అపార్ట్‌మెంట్‌లో రూ.34 లక్షల విలువైన బంగారం, వజ్రాల ఆభరణాలు చోరీ చేసిన కేసులో పనిమనిషిని అరెస్టు చేశారు. మార్చి 27న వృద్ధ దంపతుల మనవడి నామకరణ ఉండడంతో ఆభరణాలు ఉపయోగించారు. ఆ తర్వాత వాటిని ఏప్రిల్ 4న బీరువాలో భద్ర పరిచారు. ఏప్రిల్ 18న పరిశీలించగా ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదు చోరీ అయినట్టు గుర్తించారు. మార్చి ఆఖరు నుంచి ఏప్రిల్ 18 దాకా వారి ఇంటికి పని మనిషి మినహా మరెవ్వరూ రాలేదని గుర్తించడంతో ఆమెను విచారించగా చోరీ విషయం బయటకు వచ్చిందని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ వెల్లడించారు. శుక్రవారం స్వాధీనం చేసుకున్న సొత్తును మీడియాకు ప్రదర్శించారు.

బ్యూటీషియన్ ఇంట్లో..

కెంపేగౌడనగర్‌లో నివసించే ఓ బ్యూటీషియన్ ఇంట్లో పథకం ప్రకారం చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు కమిషనర్ తెలిపారు. మార్చి 29న చోరీ జరిగిందన్నారు. బ్యూటీషియన్‌ను ఓ పథకం ప్రకారం ఇంటికి రప్పించుకుని ఒకరికి అలంకరణ చేయించారు. ఈలోగా ఆమె పర్సులోని తాళాలను చోరీ చేసి వాటిని డూప్లికేట్ చేసుకున్నారు. ఇంట్లోని రూ.9.22లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ముగ్గురిని అరెస్టు చేశామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.99	1,575.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	120	119
సామర్థ్యం (టీఎంసీలు)	3.57	2.73

ఓట్ల అస్త్రంగా అంజనాద్రి బెట్ట

● గెలుపొందితే కొప్పళ నియోజకవర్గాన్ని అయోధ్య తరహాలో అభివృద్ధి చేస్తామని ప్రధాన పార్టీల హామీ

బళ్లారి గాంధీనగర్, మే 3: లోక్‌సభ ఎన్నికలు జరగడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే మిగిలిఉండగా, విజయం కోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. హనుమ జన్మించిన ప్రాంతంగా ఖ్యాతి పొందిన గంగావతి తాలూకా అంజనాద్రి అభివృద్ధి విషయం రెండు పార్టీలకు అస్త్రంగా మారిందని చెప్పవచ్చు. అయోధ్య రామజన్మ భూమిలో శ్రీరామ మందిరం నిర్మాణమైన తరువాత అంజనాద్రికి దేశ, విదేశాల నుండి పర్యాటకులు వెల్లువెత్తుతున్నారు. దీంతో హనుమ జన్మించిన అంజనాద్రి అంతర్జాతీయ స్థాయిలో పేరొందింది. ప్రక్కనే ఉన్న ప్రపంచ చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపి, ఆనెగొంది చూసేందుకు వచ్చే పర్యాటకులు అంజనాద్రి బెట్ట సందర్శించుకుని ఇక్కడి ప్రకృతి వైభవాలను, రామాయణ కాలంనాటి ఘట్టాలను గుర్తుచేసుకుంటున్నారు. అందుచేత కిష్కింధ సమీపంలోని అంజనాద్రి అభివృద్ధి విషయమై రెండు పార్టీలు పోటీపడుతున్నాయి



బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు



కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాళ్

గత బీజేపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మయి శాసనసభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందే అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అందుకు ముందు అంజనాద్రి అభివృద్ధికి రూ.రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రస్తుతం రూ 20 నుండి రూ 22కోట్ల వరకు మౌలిక సౌకర్యాలు కల్పించే పనులు కొనసాగుతున్నాయి. అందుచేత బీజేపీ తమద్వారానే అంజనాద్రి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అయోధ్య మాదిరిగానే అంజనాద్రిబెట్టను అభివృద్ధి పరిచి రవాణా సౌకర్యం పునరుద్దరిస్తామని పేర్కొంటోంది. మాజీ మంత్రి కరిడి సంగణ్ణ గంగావతి రైల్వేలైను, అంజనాద్రి వరకు రోప్‌వే అభివృద్ధి పరుస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. కొప్పళ నియోజకవర్గంలో అంజనాద్రి అభివృద్ధి పనులనే ముందు పెట్టుకుని బీజేపీ ప్రజల వద్ద ఓట్లను అడుగుతోంది. అంజనాద్రి అభివృద్ధియే మొదటి కర్తవ్యంగా భావిస్తున్నట్లు ప్రజలకు హామీ ఇస్తోంది. కాంగ్రెస్ కూడా తానేమి తక్కువ కాదన్నట్లుగా గంగావతి నియోజకవర్గం విషయాన్ని ముందు పెట్టుకుని ఓటర్ల వద్దకు వెళుతోంది. బీజేపీ అంజనాద్రిబెట్ట అభివృద్ధికి ప్రకటించిన రూ 100 కోట్లలో విడుదల చేసింది కొంచెమేనని, అందుచేత నియోజకవర్గం అభివృద్ధి కోసం ఈ సారి బడ్జెట్‌లో వందకోట్ల రూపాయలు తామే రిజర్వు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం గంగావతిలో జరిగిన కాంగ్రెస్ ప్రచార సభలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి అంజనాద్రి బెట్టను బీజేపీ ఏమీ కాంట్రాక్టు తీసుకోలేదని, తానుకూడా హనుమ భక్తుడినేనని, ఇదే కారణం చేత ప్రతి యేటా మాల ధరిస్తున్నట్లు తెలిపారు. తాను కూడా రామ, హనుమ భక్తులుగా చెప్పుకొచ్చారు.

గత శాసనసభ ఎన్నికల్లో కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కెఆర్‌పిసి) తరపున పోటీ చేసిన గాలి జనార్దన్ రెడ్డి కూడా ఇదే విషయం ముందు పెట్టుకుని ఓట్లు అడిగారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో చేరిన కారణంగా గతంలో చెప్పిన మాటకు బద్ధుడునై ఉంటానని చెబుతున్నాడు. మొత్తం మీద రెండు పార్టీలు అంజనాద్రి విషయాన్ని ప్రచారం వేళ ముందు పెట్టుకుని వెళుతున్నాయి. స్థానిక ప్రజలు మాత్రం అధికారంలోకి ఎవరు వచ్చినా అయోధ్య మాదిరిగా ఈ నియోజకవర్గం అభివృద్ధి కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు.



ఆంజనేయస్వామి జన్మస్థలిగా భావిస్తున్న అంజనాద్రి బెట్ట

ఓటు వేయడం మన హక్కు



మాట్లాడుతున్న రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, మే 3: లోక్‌సభ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఓటు వేసి మంచి నాయకులను ఎన్నుకోవాలని జిల్లా స్వీప్ కమిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప అన్నారు. జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో హలకుంది గ్రామానికి చెందిన జాతీయ మహాత్మగాంధీ ఉపాధి హామి పథక కార్మికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు వేయడం ప్రతిపౌరుడి ప్రాథమిక హక్కు అని, కనుక ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలన్నారు. పోలింగ్ రోజున జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని, వృద్ధులు, వికలాంగులు, గర్భిణుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువుగా ఉన్నందున వీలైనంత వరకు ఉదయం పూట ఓటింగ్ వేయాలని తెలిపారు. కార్యక్రమంలో బళ్లారి తాలూకా స్వీప్ నోడల్ అధికారి, మాదగిన బసప్ప, పీడీఓ ప్రభాకర్, రమేశ్, టీసీ మహంతేశ్, శేఖర్‌రెడ్డి, బిల్ కలెక్టర్ కొట్రయ్య, డీఈఓ రాజుతో పాటు 700మంది ఎన్‌ఆర్‌ఈజీఏ కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చడం కుదరదు



మాట్లాడుతున్న మాజీమంత్రి మహేష్

బళ్లారి సిటీ, మే 2: ప్రజాప్రభుత్వ వ్యవస్థలో రాజ్యాంగాన్ని మార్చడం సాధ్యంకాదని మాజీ మంత్రి మహేశ్ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ సముదాయం బ్రెయిన్ వాష్ చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో రెండు అబద్ధాలను ప్రచారం చేస్తోందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్ తీసివేస్తుందని అసత్య ప్రచారం చేస్తోందన్నారు. తన ప్రాణం ఉన్నంతవరకు రాజ్యాంగాన్ని మార్పడం జరగదని, రిజర్వేషన్ తీసివేసే ప్రసక్తిలేదని మహారాష్ట్రలో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారన్నారు. రాష్ట్రంలో మైత్రి వలన పాత మైసూర్ ప్రాంతంలో ఎక్కువబలం వచ్చిందన్నారు. మోదీ మూడవ సారి ప్రధాని అవుతారన్నారు. గత పదిసంవత్సరాల కాలంలో ఆయన ఒక మచ్చకూడా లేకుండా దేశాన్ని పాలించారన్నారు. ఈసందర్భంగా జిల్లాధ్యక్షులు అనిల్‌కుమార్, ప్రముఖులు హనుమంతప్ప, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, రాజీవ్ తొగరి, మురారీ గౌడ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

బళ్లారి, మే 3(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల విధులకు వెళ్లడానికినిరాకరించిన ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను విజయనగర జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ సస్పెండ్‌చేశారు. కూడ్లిగి తాలూకా గూడెంగోటె పోలింగ్ బూత్ నంబరు 119కి బీఎల్‌వోలుగా ఇద్దరు మహిళ ఉపాధ్యాయురాళ్లను ఎన్నికల అధికారి నియమించారు. కానీ వారు విధులకు వెల్లలేమని తేల్చి చెప్పారు. దీనితో ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేసి వారి స్థానంలో కొత్తగా ఇద్దరిని బిఎల్‌వోలుగా నియమించినట్లు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

బళ్లారి సిటీ, మే 3: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ పోలీస్ అధికారులు పలు ప్రాంతాల్లో దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ మాట్లాడుతూ.. కురుగోడు తాలూకా కోళూరు క్రాస్ నుంచి సిరుగుప్ప వెళ్ళే రహదారిపై ద్విచక్ర వాహనంపై 17.289 లీటర్ల మద్యం అక్రమ రవాణా చేస్తుండగా గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. సండూర్ తాలూకా గొల్లరహట్టి క్రాససమీపంలో ద్విచక్ర వాహనంపై 25.920లీటర్ల మద్యం రవాణా చేస్తుండగా గుర్తించి సీజ్‌చేశామన్నారు. అలాగే సిరుగుప్ప తాలూకా వెంకటాపుర రుద్రభూమి సమీపంలో ద్విచక్ర వాహనంపై 51.840 లీటర్ల మద్యాన్ని రవాణా చేస్తుండగా వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

సమస్యలపై గళం విప్పాలంటే తుకారామ్‌కు ఓటు వేయాలి
- మంత్రి రామలింగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

బళ్లారి సిటీ, మే 3: రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నా కేంద్రంలోని 25మంది బీజేపీ సభ్యులు నోరు మెదపలేదని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాంను గెలిపించాలని రవాణా శాఖా మంత్రి రామలింగారెడ్డి అన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రం కరువు కాటకాలతో అల్లాడుతున్నదన్నారు. రాష్ట్రంలోని 236 తాలూకాలలో 224 తాలూకాలు కరువుబారిన పడ్డాయని, కాని ఏడు నెలలైనా కేంద్ర ప్రభుత్వం కరువు పరిహార నిధులను విడుదల చేయలేదన్నారు. కేంద్రంలో బీజేపీ ఎంపీలు 27మంది ఉన్నా నోరు ఎత్తలేదన్నారు. ముఖ్యమంత్రి సమావేశానికి పిలిచినా ఎవరూ రాలేదని, అందుకని రాష్ట్రప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించిందన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్య కేసులో ఎస్‌ఐటీ తనిఖీ నిర్వహిస్తోందని, తనిఖీ అనంతరం న్యాయాన్యాయాలు బయటపడుతాయన్నారు. యుపీఏ ప్రభుత్వ అవధిలో అణ్ణా హాజారే పోరాటం చేస్తే 2జి స్కామ్, బొగ్గు స్కామని లేనిపోనివి అంటకట్టారని, ఆఖరికి ఏమి జరిగిందని ప్రశ్నించారు. కొక్కె సుబ్రహ్మణ్య దేవస్థానానికి ఈఓగా నియామకమైన యేసురాజ్ క్రిస్టియన్ కాదన్నా బీజేపీ వినిపించుకోలేదన్నారు. ఏసుక్రీస్తు డిసెంబరు 25న జన్మించడం వల్ల వారి తల్లిదండ్రులు యేసురాజ్ అని పేరు పెట్టారన్నారు. సమావేశంలో కేపీసీసీ మాజీ అధ్యక్షులు అల్లం వీరభద్రప్ప, జిల్లాధ్యక్షుడు అల్లం ప్రశాంత్, ముండ్రగి నాగరాజు, బుడా అధ్యక్షులు ఆంజనేయులు, వెంకటేశ్‌హెగ్డె, కల్లుకంబ పంపాపతి, గాదెప్ప తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతా

కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్

కంప్లి, మే 3 : ఈ ఎన్నికల్లో ఉభయ జిల్లా ప్రజలు తమకు అవకాశం కల్పిస్తే ఉభయ జిల్లాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ తెలిపారు. శుక్రవారం కుడితిని పట్టణంలో కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ నేతృత్వంలో జోరుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగుసార్లు తమను ఎమ్మెల్యేగా గెలిపించారని, అదేవిధంగా ఈ ఎన్నికల్లో మరొకసారి ఎంపీగా అవకాశం కల్పిస్తే ఈ జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతానన్నారు. గతంలో కుడితినికి డీఎంఎఫ్ నిధులు సుమారు రూ. 50 కోట్ల వరకు మంజూరుచేయించానని, సీసీ రోడ్లు, ఎస్‌హెచ్ 63 రోడ్డు అభివృద్ధి పనులు, హైమాక్స్ లైట్లు, తాగేనీరు, తదితర అభివృద్ధి పనులను చేపట్టి కుడితినిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దానన్నారు. అలాగే తమ ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు పథకాలు ఇవ్వడం వల్ల ప్రజలకు, రైతన్నలకు, విద్యార్థులకు, బలహీన వర్గాలకు అండగావున్నారన్నారు. అలాగే ఈ ఎన్నికల్లో కూడా గెలుపొందిన అనంతరం రూ.లక్ష మహిళలు ఖాతాలో కూడా జమ అవుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే అభివృద్ధి సాధ్యమని, బీజేపీ ప్రభుత్వం కుతంత్రాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. వీరితోపాటు కేశవస్వామి, ఏకాంబరం, దొడ్డప్ప, వీకేసీ చంద్రప్ప, చంద్రయ్య దొడ్డ బసప్ప, అంజి, కౌన్సిలర్లు కనికేరి పంపాపతి, లెనిన్, వెంకటరమణబాబు, గంగాధర, బీసన్న, మాంతేష్, మోటా తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



కుడితిని పట్టణంలో బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి తుకారామ్

ఐదు గ్యారెంటీ పథకాలే కాంగ్రెస్ గెలుపునకు నాంది



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి జహీర్ అహ్మద్

సిరుగుప్ప, మే 3 : రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేపట్టిన ఐదు గ్యారెంటీ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్ గెలుపుకు నాంది అవుతాయని రాష్ట్ర మంత్రి జహీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం సిరుగుప్పపట్టణం ఎస్ఏఎస్ హాలులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కొప్పాళ లోక్‌సభ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్ తరపున బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేద ప్రజల కోసం ఐదు గ్యారెంటీ పథకాలు అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళల ఖాతాకు రూ.లక్ష జమ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొప్పాళ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్, ఎమ్మెల్యే బీఎం నాగరాజు, బీఎం సతీష్, కొడ్లి మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షులు కరిబసప్ప, కౌన్సిలర్ రమేష్, మోహిద్దీన్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు ప్రచారం

కంప్లి, మే 3 : బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గెలుపు కోసం కంప్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు కంప్లి నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేపడుతున్నారు. ఇప్పటికే ఆయన భార్య దీప కూడా తమదైన శైలిలో ఉపాధి కూలీల వద్దకు వెళుతూ మండుటెండలో సైతం తమ నాయకుడి గెలుపు కోసం ప్రచారం చేపడుతున్నారు. అలాగే తమ వంతుగా కురుగోడు, కంప్లి తాలుకాల్లో ప్రతినిత్యం తమ కార్యకర్తలతో కలసి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గెలుపుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సూచించారు. ఈ శుక్రవారం కరికేరి గ్రామంలో ప్రచారం కోసం వెళ్లగా అభిమానులు అభినందించి సన్మానించారు. ఈ ఎన్నికల్లో శ్రీరాములుకు ఓటు వేసి గెలిపిస్తామని కార్యకర్తలు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి కోసం బోయపాటి విష్ణువర్ధన్ ప్రచారం

బళ్లారిరూరల్, మే 3 : బళ్లారి 34వ వార్డు శాంతినగర్‌లో లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం నగరంలో బోయపాటి విష్ణువర్ధన్ విస్తృత ప్రచారం చేశారు. నగరంలోని పలు వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీలు అమలు చేయడంతో పేదబడులు బలహీనవర్గాలు అనుకూలంగా వుంటున్నాయని, ప్రతి మహిళకు రూ. రెండు వేలు, ఉచిత రేషన్, ఉచిత బస్సు తదితర పథకాలతో పాటు అభివృద్ధి కూడా చేస్తున్నామని తెలిపారు. కావున కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్‌కు ఓటు వేసి గెలిపించాలని బోయపాటి విష్ణువర్ధన్ పలు వార్డుల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. అదేవిధంగా నగరంలోని పలు వార్డుల్లో తుకారామ్ గెలుపు కోసం కాంగ్రెస్ మహిళా నాయకురాలు గౌసియా, పద్మతో పాటు పలువురు మహిళా నాయకులు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం బిసినల్లి, జనతానగర్, మిల్లర్‌పేట, రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. .

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి

గిట్టుబాటు ధర లేక రోడ్డుపై పారబోస్తున్న రైతులు

కంప్లి, మే 3 : ఈ యేడాది రబీలో బోర్ల కింద కాస్తో కూస్తో నీటితో ఉల్లిపంటను పండించినా గిట్టుబాటు ధరలు రాక రైతన్నలు తల్లడిల్లుతున్నారు. పంటను కోసేందుకు కూలీ డబ్బులు కూడా రావడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు పెరుగుతున్నా పండించే పంటకు ధరలు పెరగడం లేదన్నారు. ఇందుకు నిరసనగా హువిన అడగళి పట్టణం లాల్ బహదూర్ శాస్త్రి సర్కిల్‌లో రైతులు పండించిన ఉల్లిపాయలను రోడ్డుపై పారబోశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్దేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం నాయకులు తమకు ఓటేసి గెలిపిస్తే తమను ఆదుకుంటామని తెలుపుతున్నారని, ఇంతవరకు ఏ రైతును ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. రైతులు తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఎన్నికలు వున్నా లేకున్నా రైతులను ఆదుకునే నాయకులు కావాలన్నారు. పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు.



హువిన అడగలి లాల్ బహదూర్ సర్కిల్‌లో రోడ్లపై పారవేసిన ఉల్లి

గ్రామాల్లో జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ ప్రచారం

బళ్లారి సిటీ,మే 3: గ్రామాంతర ప్రాంతాలలో బీజేపీ అభ్యర్థి శ్రీరాములుకు మద్దతుగా శుక్రవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఈసందర్భంలో జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ, మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ద్వారా మాత్రమే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈసారి లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శ్రీరాములుకు ఓటు వేసి గెలిపించాల ని మోదీని మూడవ సారి దేశ ప్రధాన మంత్రిగా చేసి దేశ అభివృద్ధికి తోడ్పడాలని దయచేసి బీజేపీ, జేడియస్ మైత్రి అభ్యర్థి శ్రీరాములుకు ఓటు వేయాలన్నారు. బళ్లారి గ్రామాంతర ప్రదేశాలైన చరకుంటె, కమ్మరచేడు, ఎత్తినబూదిహాళ్, మించేరి తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వ ఐదు గ్యారెంటీలు లోక్ సభ ఎన్నికల నంతరం ఉంటాయో లేదో తెలీదన్నారు. ఈసందర్భంలో జేడీయస్ మాజీ మహానగర పాలిక సభ్యులు కృష్ణ, వంద్రి, యల్లనగౌడ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

వర్షపునీటి సేకరణతోనే పర్యావరణ పరిరక్షణ



ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటైన వర్షపునీటి సేకరణ బావి

హోసూరు, మే 3: హోసూరు చుట్టుపక్కల మూడు వేలకు పైగా కర్మాగారాలు నడుస్తున్నాయి. పరిశ్రమలు పెరగడంతో పాటు నివాస, వాణిజ్య సంస్థలు పెరిగాయి. తద్వారా వ్యవసాయ భూములు తగ్గాయి. బోరుబావులకు ఇస్తున్న ప్రాధాన్యత వర్షపునీటి సేకరణ పథకానికి ఇవ్వడంలేదు. అలాగే ఇంకుడు గుంతలను కూడా నామమాత్రంగా ఏర్పాటు చేసి వదిలేశారు. ఈసారి ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో బోర్లలో నీటిమట్టం తగ్గింది. కొన్నిచోట్ల భూగర్భ జలాలు 1200 అడుగులకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు హోసూరులో ఇంతటి నీటి కొరత ఎప్పుడూ చూడలేదని తెలుస్తోంది. ఉదయం బోరుబావి తవ్వగా నీరు వచ్చినా సాయంత్రానికి బావిలో నీరు రావడం లేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈనేపథ్యంలో భూగర్భ జలాలను పెంచేందుకు వర్షపు నీటి సంరక్షణ పథకాన్ని అమలు చేయాలని సామాజిక కార్యకర్త, మాజీ ఎమ్మెల్యే మనోహరన్ డిమాండ్‌చేశారు. ఆయన మాట్లాడుతూ నగరం మొత్తానికి రామనాయకన్ సరస్సు నుంచి తాగునీరు తెచ్చుకునేవారని, తాను పంచాయతీ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు రామానాయకన్ సరస్సును శుభ్రంగా ఉంచేలా కాపలా వ్యవస్థ ఉండేదన్నారు. కానీ ఇప్పుడు నగరమంతా వ్యర్థాలు, రామనాయకన్ సరస్సు దర్గా చెరువు, బస్తీ చెరువు, పెరియ సరస్సు, నగరం చుట్టు ప్రక్కల ఉన్న సరస్సులలో డంప్ చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. చెరువు ప్రాంతాలను చదును చేస్తుండడంతో వర్షపు నీటిని సేకరించే పరిస్థితి కరువైందన్నారు. 2001లో వర్షపు నీటి సంరక్షణ ప్రాజెక్టు ప్రారంభించబడిందని అయితే ఇది కూడా హోసూరులో నామమాత్రంగా ఉండడంతో ఫలితాలు లేకపోయిందన్నారు. తప్పనిసరిగా వర్షపునీటి సేకరణ వ్యవస్థ అమలుతోనే ప్రస్తుత అవసరాలకు, భావితరాలకు నీరు సాధ్యమని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

హోసూరు (క్రైం) మే 3: హోసూరు సమీపంలోని జూజువాడీ చెక్‌పోస్టు వద్ద సిప్‌కాట్ పోలీసులు అత్తిబెలె నుంచి హోసూరుకు వస్తున్న సిటీ బస్సును ఆపి సోదా చేశారు. అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల విచారణలో అతడు అంచెట్టి తాలూకాలోని సిద్దంతపురం గ్రామానికి చెందిన మణికంఠన్(27)గా గుర్తించారు. అతడు అవినాసిలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ ఒడిశా నుంచి 10 కిలోల గంజాయిని రైలులో బెంగుళూరుకు తీసుకొచ్చాడని తేలింది. అక్కడి నుంచి హోసూరు బస్సులో అత్తిబెలె చేరుకున్నట్లు తెలిసింది. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



నిందితుడు మణికంఠన్



జాతరలో కరగ ఊరేగింపు..

ఘనంగా మారియమ్మ జాతర

హోసూరు, మే 3: హోసూరు సమీపంలోని తొరపల్లిలో గ్రామదేవత మారియమ్మ జాతర శుక్రవారంఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మొదటగా దక్షిణ పినాకిని నదికి గంగాపూజ నిర్వహించారు. కరగను పురవీధులలో ఘనంగా ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జాతరసందర్భంగా గ్రామంలో ఎటు చూసినా సందడి నెలకొంది.

'ప్రజ్వల్ రేవణ్ణను కఠినంగా శిక్షించాలి'



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టిన మహిళా కాంగ్రెస్ నేతలు

రాయచూరు, మే 3 : మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసి దేశం విడిచి పారిపోయిన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను చట్టపరంగా శిక్షించాలని మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు పుష్ప అమరనాథ్ డిమాండ్ చేశారు. ప్రజ్వల్ లైంగిక చర్యలను వ్యతిరేకిస్తు మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన పుష్ప అమరనాథ్, తప్పు చేసినందుకే ప్రజ్వల్ దేశం విడిచి పారిపోయారని ఆరోపించారు. బేటి బచావో బేటి పడావో అంటు ఉపన్యాసాలు ఇచ్చే ప్రధాని నరేంద్ర మోదీ మహిళలను వేధిస్తున్న ప్రజ్వల్ రేవణ్ణకు ఏ విధంగా మద్దతునిస్తారని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో ఓట్లకోసం ఇలాంటి అసాంఘిక వ్యక్తులతో మైత్రి చేసుకున్న బీజేపీ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

కాగా ప్రజ్వల్ రేవణ్ణను వెంటనే దేశానికి రప్పించి కఠినంగా శిక్షించాలని మహిళలు డిమాండ్ చేవారు. బీజేపీకి జేడీఎస్‌కు ప్రజ్వల్ రేవణ్ణకు వ్యతిరేఖంగా మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పాక్ అనుకూల నినాదాలు చేసిన వారిని కాల్చి చంపాలి: మంత్రి జమీర్

రాయచూరు, మే 3 : దేశ సార్వభౌమత్వాన్ని సవాలు చేసే రీతిలో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ ఇక్కడ నినాదాలు చేసే వారిని తుపాకితో కాల్చి చంపాలని మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం జిల్లాలోని సింధనూరు పట్టణంలో మైనార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సభలో మాట్లాడిన మంత్రి జమీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ అండతోనే కొంత మంది పాకిస్తాన్ జిందాబాద్ అంటున్నారని వస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న దేశభక్తిని ఎవ్వరు శంకించలేరని ఇంకొకరి సర్టిఫికేట్ తమ పార్టీకి అవసరం లేదన్నారు. అదే సమయంలో పాకిస్తాన్ జిందాబాద్ అనే వారిని కాల్చి చంపాలన్న మంత్రి ఈ విషయంలో న్యాయస్థానాల నుంచి అనుమతి పొంది నిందితులను అక్కడే నిలువునా కాల్చి పారేయాలన్నారు.